
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
మంగళవారం 19 ఆగస్టు 2025



99 శాతం పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 99.7 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్ పంపిణీ చేసినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా అతహరి తెలిపారు. ఈ నెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా టాబ్లెట్ పంపిణీ ప్రారంభించామని, ఆ రోజు తప్పిపోయిన పిల్లలకు తిరిగి ఈ నెల 18న టాబ్లెట్ అందించినట్లు తెలిపారు. జిల్లాలో 2,59,365 మంది పిల్లలు ఉన్నారని, వారిలో 2,58,593 మంది పిల్లలకు ఆల్బెండజోల్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, గౌడ సంఘాల నాయకులు

కరీంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సామాజిక సమానత్వా నికి కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న కుల వ్యవస్థ, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పాపన్న ప్రజల్లో పోరాట పటిమపై దిశానిర్దేశం చేశారని అన్నారు. అనంతరం అల్గునూరు వంతెన వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల స్వామిగౌడ్, పట్టణ అధ్యక్షులు దూలం అంజయ్య, రాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బుర్ర ముత్తయ్య గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మార్క రాజుగౌడ్, పురుషోత్తం, ఆశిష్ గౌడ్, సాగర్ గౌడ్, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



24/7 డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఈ యేడు కేసుల్లో చిక్కిన వారు 1,789 మంది

- రూ. 64.1 లక్షల జరిమానా
- గత ఏడాది 6,005 కేసుల్లో 147 మందికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కరీంనగర్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. నగరవ్యాప్తంగా ప్రతిరోజు ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు పగలు, రాత్రి సమయాల్లో బ్రీత్‌ఎనలైజర్ పరికరాలతో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదివరకు రాత్రి పూట మాత్రమే డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తాజాగా పగలు, రాత్రి అంటూ తేడా లేకుండా ఆకస్మికంగా రోడ్లపై తనిఖీ నిర్వహిస్తున్నారు. ఒక్కసారి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో వాహనదారుడు పోలీసులకు చిక్కితే జైలు శిక్ష లేదా జరిమానా నుంచి తప్పించుకోలేక పోతున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానాలు ఒక రోజు నుంచి 3 నెలల వరకు జైలుశిక్షలు విధిస్తున్నాయి. దీంతో వాహనదారులు బెంబేలెత్తున్నారు.

● మద్యం మత్తులో ప్రమాదాలు

మద్యం సేవించి వాహనాలు నడుపడంతో ప్రమాదాలు జరిగి వాహనం నడిపివారితో పాటు రోడ్డుపై వెళ్తూ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రయాణికులను చేరవేసే వాహనాల డ్రైవర్లకు కూడా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండడంతో వివిధ రకాల ఇబ్బందులు తగ్గిపోయాయి. మహిళలు అభద్రతాభావానికి లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు.

● ఈ ఏడాది జనవరి నుంచి జూలై చివరి వరకు కరీంనగర్ వ్యాప్తంగా నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో

(మిగతా 8వ పేజీలో)

2025 జనవరి నుంచి జూలై వరకు డ్రంకెన్ డ్రైవ్ కేసుల వివరాలు

2025	డ్రంకెన్‌డ్రైవ్ కేసులు	జరిమానా
జనవరి	256	రూ. 9,31,304
ఫిబ్రవరి	135	రూ. 4,59,400
మార్చి	325	రూ. 9,21,900
ఏప్రిల్	232	రూ. 7,99,228
మే	226	రూ. 10,42,500
జూన్	378	రూ. 13,63,402
జూలై	237	రూ. 8,92,438
మొత్తం	1,789	రూ.64,10,172

ఒకరికి 3 రోజుల జైలు శిక్ష, 10 వేల జరిమానా

కరీంనగర్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పోలీసుల తనిఖీలో పట్టుబడిన ఓ వ్యక్తికి 3 రోజుల జైలు శిక్షతోపాటు 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ కరీంనగర్ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించారు. కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన ప్రకారం... కొత్తపల్లి పోలీసు ఠాణా పరిధిలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలో కారు నడుపుతున్న ఓ వ్యక్తిని బ్రీత్‌ఎనలైజర్‌తో తనిఖీ చేయగా 100 ఎంఎల్ రక్తంలో 48 ఎంజీ ఆల్కాహాల్ శాతం నమోదైంది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు సోమవారం కరీంనగర్ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రవీందర్‌రెడ్డి నిందితుడికి 3 రోజుల సాధారణ జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. శిక్ష అమలు నిమిత్తం నిందితుడిని కరీంనగర్ జైలుకు తరలించారు. 100 ఎంఎల్ రక్తంలో 70 ఎంజీ అల్కాహాల్ వరకు జైలు శిక్ష ఉండదని, జరిమానా మాత్రమే ఉంటుందని భావిస్తున్న వాహనదారులు ఈ కోర్టు తీర్పుతో ఉలిక్కి పడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని కొత్తపల్లి సీఐ హెచ్చరించారు.



బ్రీత్‌ఎనలైజర్‌లో నమోదైన 48 ఎంజీఎం ఆల్కాహాల్ శాతం

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మన్లు

- జిల్లాలో బీఆర్‌ఎస్‌కు షాక్
- కవ్వంపల్లి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన సింగిల్‌విండో చైర్మన్లతో టీపీసీసీ అధ్యక్షుడు అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్ నియోజకవర్గం సింగిల్ విండో చైర్మన్లు సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే మానకొం డూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, తాజాగా ఆ పార్టీకి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వారంతా సోమవారం హైదరాబాద్ తరలి వెళ్లి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సింగిల్ విండో చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, శంకరపట్నం మండలం తాడికల్ సింగిల్ విండో చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి, మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ అనభేరి రాధాకిషన్ రావు, మానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, దేవంపల్లి సింగిల్ విండో చైర్మన్ కసిరెడ్డి లలితప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు అందిస్తున్న ప్రజాపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, రైతు పక్షంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు నచ్చడంతోనే బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా సింగల్ విండో చైర్మన్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, నుస్తులాపూర్ సొసైటీ అధ్యక్షుడు గుజ్జుల రవీందర్ రెడ్డి, డైరెక్టర్ అలువాల కోటి తదితరులు పాల్గొన్నారు. రైతులకు అవసరమైన యూరియా అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆందోళనలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో చైర్మన్‌లు కాంగ్రెస్‌లో చేరడం బీఆర్‌ఎస్‌కు షాక్‌గా మారింది.

ఎల్‌ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో..

తిమ్మాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ కాలువల ద్వారా స్వల్పంగా నీటి ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం సాయంత్రానికి 7.333 టీఎంసీలు ఉంది. ఎగువ కాకతీయ కాలువ నుంచి 50 క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 632 క్యూసెక్కులు మొత్తం 682 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు 18 వేల క్యూసె క్కుల నీటిని మిడ్‌మానేరుకు వదులుతున్నారు. మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటిమట్టం 27.55 టీఎంసీలకు 13.5 టీఎంసీలకు చేరుకున్నది. 16 టీఎంసీలకు చేరుకున్న తర్వాత స్పిల్‌వే ద్వారా ఎల్‌ఎండీలోకి నీటిని వదిలిపెట్టనున్నారు.

నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి వెంకటరమణ
- బేతిగల్‌లో వైద్యబృందం పరిశీలన



బేతిగల్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

వీణవంక, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవా లని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సూచించారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా పరీక్షలు నిర్వహిం చారు. సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ గ్రామంలో పర్యటించి నేరుగా గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నీరు కలుషితం కాకుం డా చూసుకోవాలని, వేడి వేడి ఆహారం తీసుకోవాలని, నీరు వేడి చేసి వడపోసుకుని తాగాలని సూచించారు. నూనె పదార్థాలు తీసుకోకుండా తొంద రగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ అధికారి కృష్ణారావు గ్రామంలో పర్యటించి వాటర్‌ట్యాంక్, వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. మిషన్ భగీరథ నీరు, వాటర్ ప్లాంట్ నీటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించను న్నట్లు తెలిపారు. వారం పాటు గ్రామంలో వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వీరి వెంట డాక్టర్ వరుణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రజావాణికి వెల్లువలా దరఖాస్తులు

- 265 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశం

సుభాష్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 265 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఆడి టోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఏమైనా దరఖాస్తులు ఉంటే వాటిని కూడా పరిష్కరించాలని సూ చించారు. వచ్చిన దరఖాస్తులలో కరీంనగర్ మున్సిపాలిటీ-37, హౌసింగ్-33, కరీంనగర్ ఆర్‌డీవో-11, కరీంనగర్ రూరల్ తహసీల్దార్- 14, మానకొండూరు తహసీల్దార్-12, వీణవంక తహసీల్దార్-13 ఇతర శాఖలకు సంబంధించినవి 145 మొత్తం 265 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతనపు కలెక్టర్లు అశ్విని తానాజి వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, కరీంనగర్ ఆర్‌డీవో మహేశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

● ప్రభుత్వ భవనాల వివరాలను అందజేయాలి

వినియోగంలో లేని ప్రభుత్వ భవనాల వివరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. వినియోగంలో లేని భవనాలను ఇతర శాఖలకు కేటాయిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంపై విస్తృత అవగాహన కల్పించాలని మెప్మా, డీఆర్‌డీవో అధికారులకు సూచించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యం లోని ఎరువుల విక్రయ కేంద్రాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

● ఆన్‌లైన్ క్లిక్..

'అంత్యోదయ' కష్టాలు



అంత్యోదయ కార్డు కోసం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రజావాణి వేదిక వద్దకు ఇబ్బందులు పడుతూ వస్తున్న కిసాన్‌నగర్‌కు దివ్యాంగురాలు గట్టు రాజమ్మ

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

తెరుచుకున్న ఎస్సారెస్పీ గేట్లు 7

యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కరీంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం మంత్రి హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రా వులతో కలిసి యూరియా, ఎరువుల లభ్యతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ యూరియా నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, హోల్‌సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారీ యూరియా స్టాక్‌ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ నుంచి వచ్చే స్టాక్ వివరాలను జిల్లాస్థాయిలో సమన్వయం చేసుకొని మండ లాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పెద్ద రైతుల అవసరాలకు విడతల వారీగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరాపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మండలస్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్

● ఏఈవోలు ఎరువుల నిల్వలు తనిఖీ చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఈవోలు క్లస్టర్ స్థాయిలో ఎరువుల నిల్వలను, అమ్మకాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైతే నిల్వలు ఉండవో అక్కడ ఉన్న రైతులను స్థానిక నిల్వలు ఉన్న మరో ఎరువుల దుకాణంలో కొనుగోలుకు సూచిం చాలని ఆదేశిం చారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యం లోని ఎరువుల విక్రయ కేంద్రాలను ఎంపీడీవోలు, ఏఈవోలు పరిశీలించాలని అన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలపై నిఘా ఉంచాలని, వాటి అమ్మకాల రిజిస్టర్ తనిఖీ చేయాలని అన్నారు. నానో ఎరువుల వినియో గంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విష జ్వరంతో పారిశుధ్య కార్మికుడు మృతి

చిగురుమామిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న జుట్టు స్వామి(51) అనే పారిశుధ్య కార్మికుడు సోమవారం విషజ్వరంతో మృతిచెందినట్లు గ్రామ మాజీసర్పంచ్ సన్నీళ్ల వెంకటేశం తెలిపారు. స్వామికి రెండు రోజులక్రితం తీవ్రంగా జ్వరం వచ్చింది. గ్రామంలోనే వైద్యం చేసుకున్నప్పటికీ తగ్గలేదు. ప్రైవేట్ వైద్యానికి వెళ్లలేని ఆర్థికపరిస్థితి. దీంతో పరిస్థితి విషమించి జ్వరంతో మృతిచెందాడని తెలిపారు. గ్రామాల్లో దోమలు ఎక్కువగా ఉండడం వల్ల మురికి కాలువల వద్ద పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు జ్వరాల బారిన పడుతున్నారు. కార్మికులకు గ్లౌజ్‌లు, దోమలు కుట్టకుండా ప్రత్యేక యూనిఫామ్‌లు, అందించి, పనిగంటలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు.


జుట్టు స్వామి(ఫైల్)

యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్(35) అనే యువకుడు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాజశేఖర్ భార్య మూడునెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన రాజశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. మృతుడి తల్లి గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.


రాజశేఖర్(ఫైల్)

అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● ఒకరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్‌రహదారిపై సోమవారం రాత్రి కారు, ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా అందులో ఉన్న మరోముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎల్ఎండీపోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన నలుగురు కరీంనగర్‌లో ఓఫంక్షన్‌కి వచ్చి తిరిగి ఇంటికి హైదారాబాద్‌కు సోమవారంరాత్రి బయలుదేరారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై వెళుతున్న కారు ముందు వెళుతున్న మరో వాహనాన్ని ఓవర్‌టెక్ చేయబోయి అదుపుతప్పి పక్కనేఉన్న డివైడర్ దాటుకొని హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సును ఢీకొంది. కారు బస్సు కిందికి దూసుకువెళ్లింది. ఈప్రమాదంలో కారులో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న హైదారాబాద్‌కి చెందిన కొంగారి మృత్యుంజయ్(32) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మిగితా ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. బస్సులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సుకింద ఇరుకున్న కారులోంచి మృతదేహన్ని, మిగతావారిని బయటకు తీశారు. మృతదేహన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


ఇందిరానగర్ వద్ద జరిగిన కారు, బస్సు ప్రమాదం

చెరుకు రైతుకు ఏటా
తప్పని తిప్పలు


జగిత్యాలలో సాగవుతున్న చెరుకు పంట

- జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి తరలింపునకు రవాణా చార్జీల భారం
- ముత్యంపేట కర్మాగారం లేఆఫ్‌తో రైతులకు కష్టాలు
- రూ.3 కోట్ల రవాణా చార్జీల భారం
- ప్రభుత్వ సహాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని చెరుకు రైతులకు రవాణా చార్జీలు యేటా తప్పడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారం (ఎన్‌డీఎస్ఎల్) పదేళ్ల క్రితం లే ఆఫ్‌తో మూసివేయడంతో ప్రతీ యేటా చెరుకు రైతులు క్రషింగ్ సీజన్‌లో తిప్పలు పడుతున్నారు. జిల్లాలో పండించిన చెరుకును ఇతర ప్రాంతాలకు తరలించి అదనపు ఆర్థికభారంతో నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం చెరుకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలోని రైతులు తమ పంటను కామారెడ్డి జిల్లాకు తరలించి రవాణా చార్జీల భారం మోయనున్నారు. రవాణా కోసం టన్నుకు రూ.500 వ్యయం అదనంగా భరించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

చెరుకు రైతును వీడని లే ఆఫ్ కష్టాలు..

జిల్లాలో ఏకైక వ్యవసాయాధారిత కర్మాగారమైన మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌కు గురయి పదేళ్లుగా తెరుచుకోక పోవడంతో చెరుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్న సాకుతో 2015 డిసెంబరు 23వ తేదీన లే ఆఫ్ ప్రకటించి కర్మా గారాన్ని మూసివేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకు ఇతర ప్రాంతాలకు తరలించ డానికి రవాణా చార్జీలను మోయాల్సి వస్తోంది. జిల్లాలోని చెరుకు రైతులపై సుమారు రూ.3 కోట్ల రవాణా భారం పడుతోంది. జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకును ప్రస్తుత క్రషింగ్ సీజన్‌లో రైతులు కామారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. చెరుకు తరలింపునకు ఖర్చులు తడిచి మోపెడవుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రవాణా చార్జీలను భరించలేక ప్రభుత్వ సహాయం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తగ్గిన చెరుకు సాగు...

గతంలో జగిత్యాల జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా చెరుకు సాగు చేసేవారు. ముత్యంపేటలోని కర్మాగారం మూతపడ్డ తర్వాత ప్రస్తుతం జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో మాత్రమే చెరుకు పంట సాగు అయినట్లు అధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. 1500 ఎకరాల్లో సుమారు 60,000 టన్నుల చెరుకు దిగుబడి వస్తోంది. జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి 150 కిలోమీటర్ల దూరం చెరుకును తరలించడానికి రైతుకు టన్నుకు రూ.500 వరకు ఖర్చు అవుతోంది. జిల్లాలో దిగుబడి అయిన 60 వేల టన్నులకు సుమారు రూ.3 కోట్ల రవాణా భారాన్ని రైతులు భరించాల్సి వస్తోంది. గతంలో ముత్యంపేట శివారులో గల చక్కెర కర్మాగారానికి చెరు కు పంటను తరలించడానికి రైతులకు ఎటువంటి భారం పడేది కాదు. ప్రస్తుతం కష్టనష్టాలకు ఓర్చుకొని పండించిన చెరు కు అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కామారెడ్డి జిల్లాకు లారీలో తరలుతున్న చెరుకు (ఫైల్)

మంత్రికి రైతుల వినతి

జగిత్యాల జిల్లా కేంద్రానికి ఈనెల 13న వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పలువురు చెరుకు రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. జిల్లాలో 1500 ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నామని, సుమారు 60 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. ఇక్కడి చెరుకును కామారెడ్డిలోని గాయాత్రీ షుగర్ ఫ్యాక్టరీకి తరలించ డానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోందని, ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని మంత్రి శ్రీధర్‌బాబును రైతులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారు.

రవాణా చార్జీల భారం ప్రభుత్వం భరించాలి

వాకిడి సత్యంరెడ్డి, చెరుకు రైతు, కిసాన్‌సెల్ నాయకుడు, జగిత్యాల



జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలోని రైతులు కామారెడ్డి ప్రాంతంలోని కర్మాగారానికి చెరుకు రవాణా చేయడానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోం ది. రైతులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరించాలి. ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌లో ఉన్నప్పటికీ అధికారుల సూచనల మేరకు రైతులు చెరుకు సాగు చేశారు. అదనపు రవాణాచార్జీల భారంపై ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను విన్నవించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నాం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● ఏడుగురి అరెస్ట్

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానువాడ గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురిని పట్టుకున్నారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మానువాడ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించగా ఏడుగురు పేకాట ఆడుతూకనిపించారు. వీరినుంచి రూ.1360 నగదు, 8సెల్‌ఫోన్లు, రెండుద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురి అరెస్టు..

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై జగిత్యాల పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారివద్ద రూ.80,600నగదు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ వివరించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

● రెండు తులాల బంగారం అపహరణ

వీణవంక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామ శివారులోని రేణుకఎల్లమ్మ ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. పోలీసులు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఆలయాల్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఎత్తికెళ్లారు. కొర్కల్ గ్రామస్తుడు పూదరి కృష్ణ పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. పోలీసులు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

బావిలో దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన హమాలి శివ(25) అనేయువకుడు సోమవారం రాత్రి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం.. శివ కూలిపని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తల్లి మందలించడంతో రామన్నపల్లి పరిధిలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌లు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. నీళ్ల ఎక్కువగా ఉండటంతో మంగళవారం ఉదయం మృతదేహం వెలికి తీపిస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకనుతరలిస్తున్న మూడుట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్ర మంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సజీవ సాక్ష్యం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఫొటోలు సజీవసాక్ష్యాలు.. వేల అక్షరాలకన్నా, లక్షలాది శబ్దాలకన్నా దృశ్యం శక్తివంతమైనది. ఒక్క ఫొటోతో విభిన్న భావాలు ఆవిష్కరించవచ్చు. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పలు ఛాయాచిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

- జమ్మికుంట/ధర్మపురి, ఆంధ్రజ్యోతి


● ఎల్ఎండీలో సంధ్యా సమయం


● ధర్మపురికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి రవీందర్ తీసిన ఫొటో


● బతుకు చక్రం

ఫొటోలు : ఎండీ ముకూర్ - ఆంధ్రజ్యోతి , స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



జమ్మికుంటకు చెందిన కెమెరామన్ బిట్ల తిరుపతి పలు సందర్భాల్లో తీసిన ఫొటోలు

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనంనడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండుసంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3,500 జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూసన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ(55) అనే మహిళ 2021 జనవరి 24న రాయికల్ మండలం కుమ్మరిపెల్లిలో తన బంధువులు ఇంట్లో శుభకార్యానికి జగిత్యాల నుంచి టాటా ఏస్ వాహనంలో వెళ్లింది. డ్రైవర్ పరాంకుశం వంశీకృష్ణ వాహనాన్ని సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా నడుపడంతో మోరపెల్లి గ్రామశివారులో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న గంగవ్వ వాహనం కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కోడలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేయగా సీఐ కృష్ణకుమార్ విచారణ చేపట్టారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులోప్రవేశపెట్టారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వంశీకృష్ణకు జైలుశిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ అభినందించారు.

ప్రజావాణిలో యువకుడి ఆత్మాహత్యాయత్నం

● ఉద్యోగం ఇవ్వడం లేదని ఆవేదన ● ఆసుపత్రికి తరలింపు, ప్రాణాపాయం లేదన్న వైద్యులు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బండి సతీష్ అనే యువకుడు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన బండి సతీష్ తండ్రి మధునయ్య ప్రాథమిక పాఠశాలలో పార్ట్‌టైం స్వీపర్‌గా పని చేసేవాడు. ఈ ఏడాది జనవరి26 గణతంత్ర దినోత్సవం రోజు విధి నిర్వహణలో ఉండగా మధునయ్యకు విషపురుగు కాటు వేసింది. వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంతరలించగా చికిత్స పొందుతూ జనవరి 29న మరణించాడు. కుటుంబానికి న్యాయం చేయాలని పాఠశాల ఆవరణలో మృతదేహంతో మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ మేరకు మధునయ్య కుమారుడు బండి సతీష్ దరఖాస్తు చేసుకున్నాడు. కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని ఆందోళనకు గురైన సతీష్ సోమవారం ప్రజావాణికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన అధికారులు వెంటనే 108కి ఫోన్‌చేసి సతీష్‌ని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రధానఆసుపత్రికి తరలించారు. ప్రాణాప్రాయస్థితి నుంచి బయటపడ్డాడని వైద్యులు పేర్కొన్నారు.


పురుగుల మందు తాగిన బండి సతీష్

కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట రైతుల ఆందోళన

● పరిహారం చెల్లించాలని డిమాండ్


మొలంగూర్‌లో కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

శంకరపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కావేరి సీడ్స్‌కు చెందిన ఆడ, మగ హైబ్రిడ్ వరిరకం వంగడం సాగు చేసిన రైతులకు అనుకున్న దిగుబడి రాకపోవడంతో పరిహారం చెల్లించాలని రైతులు, ఆర్గనైజర్లు శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులోని కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళనకు దిగారు. కరీంనగర్, వరంగల్, నిజామబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలలో సీడ్ ఆర్గనైజర్లు సీడ్‌ప్లాంట్ ద్వారా తెచ్చిన హైబ్రిడ్ వరివంగడాలను రైతులకు ఇవ్వగా సాగుచేశారు. సుమారు మూడు వేళ ఎకరాలలో అనుకున్న దిగుబడి రాలేదని రైతులు ఆరోపించారు. సరైన పంట దిగుబడి రాకుంటే ఎకరాకు రూ.60వేలు పరిహారం ఇస్తామని చెప్పి సాగు చేయిం చారని రైతులు తెలిపారు. దిగుబడి చాలా తక్కువ రావడంతో ఆ వచ్చిన ధాన్యానికే డబ్బులు చెల్లించారని, పరి హారం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వరి ధాన్యం తూకం వేసి నాలుగు నెలలు గడుస్తున్నా కంపనీ ప్రతినిధులు పరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటలపాటు రైతులు సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేయగా ఏజీఎం ఆర్గనైజర్‌కు ఫోన్ చేసి మంగళవారం సమస్య పరిష్కారా నికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రెండేళ్లుగా ఎదురు చూపులు

● అమలుకు నోచుకోని పీఎం విశ్వకర్మ పథకం ● పెండింగ్‌లోనే దరఖాస్తులు

చొప్పదండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది రకాల చేతి వృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి ఉపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం విశ్వకర్మ పథకం నిలిచిపోయింది. పాతవారికి శిక్షణ లేకపోగా కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి సైట్ ఓపెన్ కావడం లేదు. తద్వారా పథకం అమలులో జాప్యం జరుగుతోంది. రెండేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. అనేకమంది లబ్ధిదారుల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2023లో పీఎంవిశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. 18రకాల చేతివృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి 15వేల రూపాయల విలువగల పనిముట్లను అందజేయాలని సంకల్పించి దరఖాస్తులను ఆహ్వానించారు. పథకం ప్రారంభ సమయంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించారు. అనంతరం పథకం కాస్తా అటకెక్కింది. ఆసక్తి ఉన్న చేతివృత్తి పనివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించగా మొదటి విడతలో కొంతమందికి శిక్షణ ఇచ్చారు. 15రోజులపాటు కరీంనగర్, జమ్మికుంటలో శిక్షణను ఇచ్చారు. వృత్తి పనుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా శిక్షణను ఇచ్చి శిక్షణకు సంబంధించి ప్రోత్సాహంగా 4వేల రూపాయలను అందించారు. అనంతరం 15వేల రూపాయల టూల్ కిట్లను అందజేశారు. కొంతమందికి బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించారు. 18రకాల చేతివృత్తుల్లో వడ్రంగి, టైలరింగ్, మేస్త్రి పనుల శిక్షణ కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగతా 15రకాల చేతివృత్తుల పనివారి కోసం అధికారులు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. మండలంలో అనేకమంది దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సైట్ ఓపెన్‌కావడం లేదు. దరఖాస్తు చేసుకున్నవారికి శిక్షణను ఇచ్చి టూల్ కిట్లు అందించాలని పలువురు కోరుతున్నారు.



● రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం..

- గోవులకొండ శ్రీనివాస్, చొప్పదండి



పీఎం విశ్వకర్మ పథకం కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను. ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశాను. మండలానికి చెందిన కొంతమందికి మాత్రమే టూల్‌కిట్లు అందాయి. చాలామంది ఎదురుచూస్తున్నారు. శిక్షణను ఇచ్చి బ్యాంకు లోన్లు ఇప్పించాలి. పథకం అందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎస్సారెస్పీ భూమి ఆక్రమదారులకు రిమాండ్

ధర్మారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నకిలీపత్రాలు సృష్టించి ఎస్సారెస్పీ భూమిని ఆక్రమించడమే కాకుండా, అధికారులను చంపుతామని బెదిరించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలకేంద్రంలో ఎస్సారెస్పీ సంబంధించిన భూములున్నాయి. వాటిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేశారని, భూమివద్దకు అధికారులు వెల్లగా తమను చంపుతామని బెదిరించారని ఎస్సారెస్పీ అధికారులు ఏప్రిల్ 23న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం ధర్మారం గ్రామానికి చెందిన యాంసాని మహేష్‌తోపాటు అతని కుమారులు యాంసాని మధు, యాంసాని మనోజ్‌లను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జా చేసిన, వాటిని అమ్ముకున్న, ప్రజలను మోసం చేసి భూములను కాజేసిన, చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.


బోస్టన్‌ను సందర్శించిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అమెరికా పర్యటనలో భాగంగా బోస్టన్ నగరాన్ని సందర్శించారు. అక్కడి తెలంగాణ మేధావులను, పూర్వ విద్యార్థులను కలిశారు. మీట్‌అండ్‌గ్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్య పాత్ర విశ్వవిద్యాలయాల బాధ్యతలు తదితర అంశాలపై చర్చించి సలహాలను తీసుకున్నారు. తెలంగాణలో విద్య పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అక్కడి ప్రముఖులు డాక్టర్ జంధ్యం దివాకర్, డాక్టర్ వెంకట్ మారోజు, రాయదాసు మంతెన తదితరులు పాల్గొన్నారు.


బోస్టన్‌లో ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కులు విడుదల


గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో 39 గేట్లు పైకి ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 1,17,148 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,26,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో ప్రస్తుత సీజన్‌లో తొలిసారిగా నీటిని గోదావరికి వదిలిపెట్టారు.

సుందిళ్ల బ్యారేజీకి భారీ వరద


సుందిళ్ల బ్యారేజీలో భారీగా చేరిన వరదనీరు

మంథనిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో సోమవారం గేట్లు ఎత్తి వేయడంతో భారీగా వరద నీరు దిగువ ప్రాంతమైన సుందిళ్ల బ్యారేజీలోకి 1లక్ష 40 వేల 428 క్యూసెకుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజిలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో ఆనీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మంథని, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, అరెంద గ్రామల వరకు గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. అడవిసోమన్‌పల్లి, వెంకటాపూర్, మల్లారం, అరెంద గ్రామల వద్ద మానేరు నది నిండుగా ప్రవహిస్తుంది.

● శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వస్తున్న వరద

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 78,059 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 32 గేట్ల ద్వారా 1,65,632 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా తరలిస్తున్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై

కేంద్ర ప్రభుత్వం ఆరా

హుటాహుటిన ఢిల్లీ నుంచి రామగుండానికి టెక్నికల్ టీమ్‌లు..

సాంకేతిక వైఫల్యాలపై కేంద్ర మంత్రుల దృష్టి


ఆర్ఎఫ్‌సీఎల్ అమ్మోనియా ప్లాంట్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. రామగుండంలో ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రైతాంగానికి యూరియా సరఫరా చేస్తున్నామని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారు. కానీ ప్లాంట్ తరచూ సాంకేతిక అవరోధాలతో షట్‌డౌన్ కావడం, నాలుగు నెలల్లో మూడు సార్లు ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి రజత్ మిశ్రా ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై సమీక్షిస్తున్నట్టు తెలుస్తుంది. పార్లమెంట్ జరుగుతున్న సమయంలో ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం ఢిల్లీ నుంచి రామగుండంకు తరలించాలని, వైఫల్యాలపై విచారణ జరుపాలనే డిమాండ్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చర్చనీయాంశమయ్యాయి.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతోపాటు కాంగ్రెస్ ఎంపీల బృందం శనివారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి నడ్డాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో సాంకేతిక వైఫల్యాలను కూడా నడ్డా దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నడ్డ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఎంపీ వంశీకృష్ణ గతంలోనే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శిని కలిసి ఆర్ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై ఫిర్యాదు చేశారు. ఎరువులు, రసాయనాలశాఖలో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ బలరాంనాయక్‌లు కూడా ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలంటూ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. నాలుగు నెలల్లో మూడు సార్లు షట్‌డౌన్‌లు జరుగడం, అమ్మోనియా పైప్‌లైన్లు నాసిరకంగా నిర్మించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్ర కోటాను సగానికి తగ్గించడం, కేటాయించిన కోటాలో సగం కూడా సరఫరా కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుంది. రెండు రోజుల క్రితం ప్లాంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది కేంద్రం కుట్ర అంటూ ఆరోపణలు చేశారు. కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రం కావడం, ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి నిలిపివేతపై కుట్ర కోణంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి హుటాహుటిన అధికారుల బృందాలు రామగుండానికి చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్‌కు చెందిన పలువురు అధికారులు రామగుండం చేరుకున్నారు. ఈ నెల 22వ తేదీలోగా ప్లాంట్‌లో ఉత్పత్తి దశలో పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో వైపు ఆర్ఎఫ్‌సీఎల్ వ్యవహారం కేంద్ర మంత్రి దృష్టికి వెళ్లడంతో ఉన్నత స్థాయి బృందం రామగుండంకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

తపాలాశాఖ ప్రమాద బీమాతో ధీమా

● రోజుకు రూ.1.50తో రూ.10 లక్షల బీమా

● రోజుకు రూ.2తో రూ.15 లక్షల బీమా



భగత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలైనా... వైద్య ఖర్చులైనా.... విద్యా ప్రయోజనా లైనా.... అత్యవసరంగా అంత్యక్రియలకు డబ్బుల అవసరానికి సామాన్యులకు బీమా పాలసీలతో తపాల శాఖ ధీమా కల్పిస్తున్నది. ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించి గాయాలైనపుడు లేదా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన సందర్భాల్లో ఇలా అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు పాక్షికంగా, లేనిపక్షంలో తాత్కాలిక వైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈ క్రమంలో రక్షణగా ప్రైవేటు బీమా పాలసీలు ఉన్నప్పటికీ ప్రీమియం అధికంగా ఉండటంతో వాటిపట్ల ప్రజలు ఆసక్తి కనబరచడంలేదు. ఈ తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా పలు ప్రైవేట్ కంపెనీలతో తపాలా శాఖ సంయుక్తంగా ప్రమాద బీమా పాలసీలు అందుబాటులోకి తీసుకు వచ్చింది.

● ఎంతో భరోసా

రోజుకు రూ.1.50తో రూ.10 లక్షలు, రూ. 2లతో రూ.15లక్షలు విలువైన బీమా పాలసీలను తపాలాశాఖ అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఏడాదికి రూ.549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ.10 లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. అంగవైకల్యం కానీ, పక్షవాతం వచ్చినా పూర్తి బీమా లభిస్తుంది. ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులు ఒ.పి.డి రూ.30 వేలు, లేదా ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేకపోతే 10 సార్లు రూ.1500 విలువైన కన్సల్టేషన్లు వర్తిస్తాయి. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో ఉంటే రూ.60 వేల వరకు చెల్లిస్తారు. ఇద్దరు పిల్లలకు విద్యా ప్రయోజనం కింద గరిష్టంగా రూ. లక్ష వరకు లభిస్తుంది. ఒకవేళ ఫీజులు తక్కువగా ఉంటే వాటినే చెల్లిస్తారు. ప్రమాదం జరిగి వ్యక్తి కోమాలోకి వెళ్తే రూ. లక్ష వరకు కవర్ చేస్తారు. ఎముకలు విరిగితే దాని ఖర్చుల నిమిత్తం రూ. లక్ష వరకు చేకూరుతుంది. తలకు ఏదైనా దెబ్బ తగిలి మానసికంగా ఇబ్బంది పడితే నాలుగు కన్సల్టెంట్లు ఉచితంగా అందించనున్నారు. ఒకరికి ప్రమాదం జరిగి వేరేచోట మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి రావడానికి రూ.25 వేల వరకు చెల్లిస్తారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు భరోసాగా రూ.5 వేల వరకు లభిస్తుంది.



● అర్హతలు

బీమా పాలసీని 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు ఎవరైనా తీసుకోవచ్చు. దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది. ఆధార్ కార్డు, దానితో లింక్ అయిన ఫోన్ నంబరు ఉండాలి. వైద్య పరీక్షలు చేసిన తరువాత కొందరికి వర్తిస్తుంది. సాయుధ బలగాలకు ఇది వర్తించదు. ఈ అవకాశాన్ని సామన్యులు బీమా పాలసీలు పొంది వినియోగించుకోవాలని కరీంనగర్ తపాలశాఖ అధికారులు కోరుతున్నారు.

కల్లుపై దుష్ప్రచారాలను నమ్మవద్దు

తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఒక కల్లు దుకాణంలో ఊదో జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా కల్లుపై వస్తున్న దుష్ప్ర చారాలను నమ్మవద్దని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పేద గౌడ మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావుగౌడ్ మాట్లాడుతూ అబ్కారీ అధికారులు గ్రామాల్లో కల్లు దుకాణాలపై దాడులు చేస్తూ వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమన్నారు. విస్కీ, బ్రాందీలో 40 శాతం ఆల్కహాల్ ఉంటుందని చెబుతున్నారని, కానీ 50 శాతం ఆల్కహాల్ ఉంటుందని, దానిపై అధికా రులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్లును మాత్రమే బదనాం చేస్తున్నారని ఆరోపించారు. కల్లుపై చేస్తున్న దుష్ప్రచారాలను ఎదుర్కోవడానికి గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారా యణగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● వరద కాలువకు చేరిన ఎస్సారెస్పీ నీరు


వరదకాలువను పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి

రామడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌజ్ నుంచి మిడ్ మానేరుకు సోమవారం కూడా నీటి విడుదల కొనసాగింది. ఆదివారం నాలుగు పంపుల ద్వారా వరద కాలువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఎస్సారెస్పీ నుంచి నీరు రావడంతో మూడు పంపులకు కుదించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి 10వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు వచ్చి చేరుతోంది. దీంతో రెండువైపులా నీరు రావడంతో వరద కాలువ ద్వారా 15వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలివెళ్తోంది. కాగా ఎస్సారెస్పీ నీరు 18వేల క్యూసె క్కుల నీటిని వరదకాలువకు విడుదల చేయడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదలను ఆపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాత్రి వరకు ప్రస్తుతంనడిపిస్తున్న మూడు పంపులను కూడా ఆపేయనున్నారు.

రామడుగు మండలం శ్రీరాములపల్లె సమీపంలోని వరదకాలువను ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సారెస్పీ నీరు, గాయత్రీ పంప్‌హౌస్ నీరు కలిసేచోట వరదకాలువను పరిశీలించారు.

మిడ్‌మానేరుకు భారీగా ఇన్‌ఫ్లో...


ప్రాజెక్ట్‌లోకి వస్తున్న నీరు

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు ఎస్సారెస్పీ, మూలవాగు, మానేరు వాగు ద్వారా భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి సోమవారం సాయంత్రం వరకు 18,628 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్‌హౌస్ నుంచి 9450 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 8వేలు క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 1178 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగు తున్నట్లు ప్రాజెక్ట్ డీఈ రాజు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.80ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 12.591 టీఎంసీల మేరకు చేరుకుంది.

ఉధృతంగా కూడవెల్లి, పల్వంచ వాగులు

నిండు కుండలా ఎగువ మానేరు..


ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

గంభీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయం నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు నిండుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, సోమవారం రాత్రి వరకు 30 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకి పరవళ్లు తొక్కేందుకు కేవలం ఒకే ఫీటు నీళ్లు అవసరం ఉన్నాయి. సోమవారం రాత్రి లేక మంగళవారం ఉదయం మానేరు మత్తడి దూకే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తం అయ్యారు.

మానేరు పరివాహక ప్రాంతాలకు వెళ్లొద్దు..

నర్మాల ఎగువ మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు సమీప ప్రదేశాలకు వెళ్లొద్దని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. నర్మాల మానేరు ప్రాజెక్టును తహసీల్దార్ మారుతిరెడ్డి సోమవారం పరిశీలించారు. మానేరు జలాశయం నిండి మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నందున మానేరు డ్యాం, మానేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, రైతు కూలీలు, మత్స్యకార్మికులు వెళ్లొద్దని తెలిపారు. పశువుల, గొర్లకాపరులు మేతకు తీసుకెళ్లద్దని సూచించారు. వాగు పక్కన పశువులను కట్టేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా పాత ఇళ్లలో ఉన్న వారు, ఫారెస్ట్ ప్రాంతాల సమీపాన నివాసం ఉండే వారు ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానేరు పరిసర ప్రాంతాల గ్రామాల్లో చాటింపు వేయడంతో పాటు 24గంటల పాటు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించటానికి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

శంభో శంకరా..

● లక్ష మంది వరకు రాజన్నను దర్శించుకున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు రాజన్న దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో పట్టణ పురవీధులు, ఆలయ పరిసరాలు భక్తజన సంద్రంగా మారిపోయాయి. భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాలను సందర్శించిన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, శివకల్యాణం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద దీపాలను వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయం ముందు భాగంలోని దారి పూర్తిగా భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఘనంగా మహాలింగార్చన..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న ఆలయం ఉదయం 5.30 గంటలకు అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో రాధాబాయి హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ విభాగాలను పరిశీలించిన ఈవో..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈవో రాధాబాయి పలు విభాగాల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. కోడెల క్యూ లైన్‌లు, బ్రేక్ దర్శనం, ధర్మగుండం, ఉచిత దర్శనం క్యూలైన్‌లతో పాటుగా ఓపెన్‌స్లాబ్ ప్రాంతాలను పరిశీలించారు. వెంట ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.


శివ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ధర్మపురిలో, కోటి లింగాలలో భక్తుల పూజలు

ధర్మపురి: శ్రావణ మాసం ఆఖరి సోమవారం శివ నామస్మరణలు చేసిన భక్తులతో క్షేత్రంలోని శివాలయాలు కిట కిటలాడాయి. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన జరిపి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరునికి అన్నపూజ చేయించారు. నేరెళ్ల సాంబశివ, రాజారం, జైనా శివాలయాల్లో కూడ భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు- రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

వెల్గటూర్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని కోటి లింగాలకు భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్త లు గోదావరి ఒడ్డున గల గంగమ్మ తల్లికి పూజలు చేశారు. స్నాన ఘట్టాలపై ఉన్న శివ లింగాలకు భక్తితో మొక్కి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వర్షాల కారణంగా గోదావరిలో నీటి మట్టం పెరగడంతో ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు పహారా నిర్వహించారు. కానిస్టేబుల్ వెంకటరెడ్డి, ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షించారు.

ఎంఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 18:(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025న నిర్వహించిన ఎంఈడీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంప్రదాయ దుస్తులు.. జీవన విధానం.. సాంస్కృతిక వేడుకలకు సంబంధించిన చిత్రాలు ప్రహరీ పై సజీవంగా దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, గుడిసెలు, పాడి పశువులు, అమ్మవారికి తీసుకెళ్తున్న నైవేద్యం, డోలు వాయించడం, తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామ శివారులోని జగదాంబదేవీ ఆలయం ప్రహరీ గోడపై గిరిజన మహిళల వేడుక చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన కళాకారుడు చందుతో ఆకర్షణీయమైన చిత్రాలను వేయించారు. గిరిజన సంప్రదాయ పద్ధతులను ఈతరం వారికి వివరించేలా చిత్రాలు ఉన్నాయి.





విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



చింతకుంటలో వెలిచాల రాజేందర్‌రావు

సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి

కరీంనగర్ టౌన్/కరీంనగర్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌లో సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా కౌండిన్య యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, మాజీ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

● సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. చెర్లబూత్కూర్ సర్వాయిపాపన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు.

● నగునూర్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సర్వాయి పాపన్న జయంతిలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, జిల్లా కార్యదర్శి వాయిల రాజకుమార్, గుడిసెల రమేష్ నివాళులు అర్పించారు.

● కరీంనగర్ బ్రిడ్జి వద్ద బీసీ సంక్షేమ సంఘం మానకొండూరు మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి నివాళి అర్పించారు.

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ ఎక్సైజ్ భవన్‌లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● సర్వాయి పాపన్నగౌడ్ మొట్ట మొదటి బహుజన చక్రవర్తి, పోరాట యోధుడని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. రేకుర్తి చౌరస్తా, మానేరు వంతెనపై పాపన్నగౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

భగత్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు చింతకుంట, రేకుర్తి, అల్గునూరు వంతెన వద్ద సర్వాయి పాపన్న విగ్రహాలకు పూల మాలవేసి నివాళులు అర్పించారు.

● రేకుర్తి చౌరస్తాలో బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వాయిపాపన్నవిగ్రహానికి పూల మాల వేశారు.

జమ్మికుంట: పట్టణంలో దేశిని కోటి, ఆరెల్లి మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

గంగాధర: బహుజన వీరుడు సర్వాయి పాపన్న అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో వేడుకల్లో పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో గౌడసంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నాయకులు కొలిమికుంటలో గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంతోపాటు గ్రామల్లో సర్వాయి పాపన్న జయంతిని గౌడకులస్థులు ఘనంగా నిర్వహించారు.

సైదాపూర్: కొమ్ముగుట్టపైఉన్న పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు. తెలంగాణ గౌడకమ్యూనిటీ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు మార్క అనిల్‌గౌడ్, వీరన్న యాదవ్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు



జమ్మికుంటలో కేక్ కట్ చేస్తున్న సీఐ రామకృష్ణగౌడ్

24/7 డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

1,789 మంది మందుబాబులు పోలీసులకు చిక్కగా వారికి 64,10172 రూపాయలు జరిమానా కోర్టు విధించింది.

2024లో కమిషనరేట్ వ్యాప్తంగా 6,005 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుకాగా 147 మందికి జైలుశిక్ష పడింది. గత ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 203 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో ఎక్కువ వరకు మద్యం మత్తులో డ్రైవింగ్ కారణంగానే ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

● ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- కరీముల్లాఖాన్, కరీంనగర్ ట్రాఫిక్ సీఐ

నగరంలో ప్రమాదాల నియంత్రణ కోసమే డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇంటి నుంచి వాహనంపై బయటకు బయలుదేరిన వాహనదారుడు(కుటుంబ సభ్యుడు) తిరిగి క్షేమంగా ఇంటికి చేరడం ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నాం. మద్యం సేవించిన సమయంలో వాహనాలు నడపకుండా ఇంటివద్దనే ఉండాలి. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి.

ఏసీపీ విజయ్‌కుమార్‌కు అభినందనలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌కు ఒకినోవా కరాటే సంస్థల అధినేత, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్ కుమార్ అభినందనలు తెలిపారు. సోమవారం ఏసీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

వానాకాలం విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు సోమవారం ప్రకటనలో సూచించారు. తడి చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లను తాకవద్దని, తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాలను ముట్టుకోవద్దని పేర్కొన్నారు.రైతులు పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరండా ఉండాలని సూచించారు. తెగిపడిన తీగలు, పరికరాలు కనిపిస్తే 1912 నంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విజన్ హైస్కూల్‌లో కృష్ణాష్టమివేడుకలు



చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

భగత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, డైరెక్టర్ సందవేని వెంకట్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఇన్‌చార్జి ప్రతిభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ బొమ్మ శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం

భగత్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేదంపాఠశాల చైర్మన్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్‌గౌడ్‌ను గ్రామస్థులు సోమవారం సన్మానించారు. గ్రామంలో పాఠశాలను నెలకొల్పి పేద విద్యార్థులకు సేవలందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ గ్రామస్థులకు మార్గదర్శకుడన్నారు. మాజీ సర్పంచ్ ఈశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వొళ్లాల మల్లయ్య పాల్గొన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులకు చోటు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నూతన కమిటీలో జిల్లా నాయకులకు చోటు లభించింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వి.రాజిరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ఈశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవాల నరహరి, చకినాల రాంమోహన్, జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు.

విద్యతో సమాజంలో మంచి గుర్తింపు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సప్తగిరి ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన 9, 10వ తరగతి విద్యార్థులకు 10 వేల రూపాయల చొప్పున నగదు, ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఉల్లాస్ ట్రస్టు బాధ్యులు ప్రదీప్, సంపత్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డీబీసీడీవోపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్న డిస్ట్రిక్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ డెవలప్ ఆఫీసర్(డీబీసీడీవో) అనిల్ ప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్స్‌లో విద్యార్థులను మెరిట్ ప్రకారం అడ్మిషన్లు తీసుకుంటామని చెబుతూనే మరో పక్క డీబీసీడీవో రికమెండేషన్ చేస్తున్నవారికే సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. అనిల్ ప్రకాశ్ ఒక హాస్టల్‌కు 20 నుంచి 50 అప్లికేషన్లు పంపిస్తున్నారని, దీంతో అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

గంగాధర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కేంద్రానికి చెందిన వివేకానంద పాఠశాల విద్యార్థి దీకొండ సిద్దివర్ధన్ తెలంగాణ క్రీడా పాఠశాలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థిని అభినందించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనంతరెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను గ్రామంలోని నిరుపేదలకు ఇవ్వాలని తహసీల్దార్ కనుకయ్యకు సోమవారం మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ వినతిపత్రం అందజేశారు. 2023లో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ చేపడుతున్నారన్న సమాచారంతో అప్పట్లో కలెక్టర్‌ను కలిసి రంగాపూర్ నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలని కోరామన్నారు.

హిందూ సమాజాన్ని చీల్చే ప్రయత్నం

ఇల్లందకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మార్వాడి గో బ్యాక్ అని హిందూ సమాజాన్ని వర్గాలుగా చీల్చే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ ఇల్లందకుంట మండలాధ్యక్షుడు భైరెడ్డి రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్వాడీలు తెలంగాణ సమాజంలో కలిసిపోయారని, రాజ్యాంగం ప్రకారం ఈ దేశపౌరులని అన్నారు. కొందరు రాజకీయ స్వార్థం కోసం ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తున్నారన్నారు.

అన్నదానం

సుభాష్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు గుజ్జు వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భరోసా సంస్థ అధ్యక్షుడు అకెనపల్లి నాగరాజు, దొంతుల రామకృష్ణ, తాటిపల్లి సతీష్‌బాబు, మల్యాల వేణుగోపాల్, తొర్తి శంకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిమ్మాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లికి చెందిన నాంపల్లి హర్షవర్ధన్ అనే విద్యార్థి ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ



గౌరీశంకరాలయంలో స్వామివారు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. పాతబజార్ గౌరీ శంకర, కమాన్ రోడ్ రామేశ్వర, ఆదర్శనగర్ రాజరాజేశ్వర, భగత్ నగర్ భవానీ శంకర, హౌజింగ్‌బోర్డ్‌కాలనీ ఉమామహేశ్వరాలయాల్లో పూజలు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కరీంనగర్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు దుర్శేడ్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామ అధ్యక్షుడు హరీష్‌గౌడ్ సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

యూఎస్ఏ దంపతులకు శిశువు దత్తత

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహంలో పెరుగుతున్న మూడేళ్ల పాపను కలెక్టర్ పమేలా సత్పతి యూఎస్ఏకు చెందిన దంపతులకు సోమవారం దత్తత ఇచ్చారు. వీరికి ఇదివరకే బాబు జన్మించగా ఆడ శిశువు దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నారు. మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం విచారించి, ఆడ శిశువును దత్తత ఇచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన దత్తత కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. ఇందుకు జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చెల్పూర్ పీహెచ్‌సీని సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, పీహెచ్‌సీ డాక్టర్ మధు, హెచ్‌ఈవో విజేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యం తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

ప్రజావాణికి అనూహ్య స్పందన

చిగురుమామిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వం మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణం నిలిపివేయాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే మైదానంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని నిలిపివేయాలని జ్యోతిబాపూలే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గత ప్రభుత్వం జ్యోతిబాపూలే మైదానంతోపాటు, ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని పార్కులుగా ఏర్పాటు చేసిందని, ఆ మైదానాల్లో వాకర్స్ కొన్ని సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టారని,వాకర్స్‌తోపాటు పార్క్‌కు వచ్చే పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అంతకుముందు సబ్ స్టేషన్ నిర్మాణాన్ని విరమించుకోవాలని వాకర్స్ సంఘ సభ్యులు కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రాలను అందజేశారు. వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చింతపువ్వు రవీందర్, జిల్లా అంజయ్య, కోశాధికారి గంప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

చిగురుమామిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థులను సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి అభినందించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్ తెలి పారు. పాఠశాలకు చెందిన జె.వైష్ణవి, పి.అనుశ్రీ, స్నేహిత గుడ్ టచ్, బ్యాడ్ టచ్ రెస్పాండింగ్ డాల్ ప్రాజెక్టును అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రూపొందించారు. ప్రాజెక్టును కలెక్టర్ ఎదుట ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన కలెక్టర్ వారిని, తోడ్పాటునందించిన ఉపాధ్యాయుల ను అభినందించారు. మరిన్ని ప్రాజెక్టులు చేయాలని అందుకు విద్యా ర్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పవతి

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ మండల పరిషత్ పాఠశాలను సోమవారం ఎంఈవో రవీందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. కనీస అభ్యస స్థాయిలను పరీక్షించారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని లెర్నింగ్ అవుట్ కమ్స్ మరింత సాధించేలాప్రయత్నించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి ఉన్నారు.

25న చలో హైదరాబాద్

గణేశ్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నలభైరెండు శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ నెల 25న ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న సత్యాగ్రహ దీక్ష సందర్భంగా చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామరస్యంగా చర్చలు జర పాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

కరీంనగర్ రూరల్/సుభాష్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడు కుందాము, మట్టి గణపతులను పూజిద్దాం అనే నినాదంతో కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని గాయత్రి పర్యవరణ సంస్థ రూపొందించిన పోస్టర్‌లను సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి, అనంతరం ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి కార్యాలయాల్లో ఆవిష్కరించారు. పెరుగుతున్న కాలుష్య నివారణ అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తమ స్వచ్ఛంద సంస్థ తరుపున ఏటా ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బండి మల్లన్న యాదవ్, ఆసిరి తిరుపతి, కాల్వ రామచంద్రం, పెద్ది లక్ష్మణ్, మెర్గవేని శ్రీకాంత్; కాల్వ శ్రీకాంత్, గాలిపల్లి నారాయణ, మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమెలా సత్పతి

యూరియా సరిపడా అందించాలి

గంగాధర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం గంగాధర మండలం గర్షకుర్తిలో యూరియా కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ యూరియా కోసం రైతులు లైన్లలో నిలబడిన దాఖలాలు లేవన్నారు. అంతకుముందు ఒక్క రైతుకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారని, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గర్షకుర్తిలో వీరాంజనేయస్వామి ఆలయ 42వ వార్షికోత్స వానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయ కులతో కలిసి పూజలు నిర్వహించారు.

వాగేశ్వరిలో ఓరియెంటేషన్ కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న గంద్ర శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాపూర్,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్‌లో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సోమవారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రెటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మొదటి దశ నుంచే తమ ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరి తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యవరణాన్ని పరిరక్షించాలని పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ అన్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పాఠశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 12వేల సైన్యంతో మొగల్ సామ్రాజ్యంపై పోరాడి గోల్కొండ కోటను ఏలిన ధీరుడు పాపన్న అని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, ఉపాధ్యాయులు బలరాం కుమారి, విద్యా కమిటీ చైర్మన్ గుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జ్ఞాపిక అందజేస్తున్న పెర్యాల సాకేత్‌రామారావు

భగత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ పేర్యాల సాకేత్‌రామారావు అన్నారు. సోమవారం రేకుర్తిలోని కిమ్స్ ఎంబీఏ కళాశాలలో సిగ్నేచర్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఓడిపోవడం, మోసపోవడం, పడిపోవడం, చెడిపోవడం ఏమీ ఉండవని కేవలం నేర్చుకోవడం మాత్రమే ఉంటాయని అన్నారు. అన్ని విషయాలు చదువు ద్వారానే సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



పెద్దపాపయ్యపల్లి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్

● కంచెల ఏర్పాటుపై నిర్లక్ష్యం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ సరైన రక్షణ వలయాలు లేకపోవ డంతో ప్రమాదకరంగా మారాయి. చిన్న చిన్న సమస్యలు ఏర్పడినప్పుడు వాటి నుంచి వచ్చే మిరుగులతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి వెళ్లే ప్రధానరహదారి పక్కన ఐదు, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు రహదారి పక్కన ఉండగా వాటి చుట్టూ ఎలాంటి రక్షణ కంచెలు లేవు. అలాగే పెద్దపాపయ్యపల్లి గ్రామం నుంచి ధర్మరాజుపల్లి గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, ధర్మరాజుపల్లి గ్రామానికి లోపలికి వెళ్లే రహదారి పక్కన, సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లె, పోతిరెడ్డిపేట, రాంపూర్, జూపాక, కనుకులగిద్దె గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

● మూగ జీవాలకు పొంచి ఉన్న ముప్పు

మేకలు, గొర్రెలు, గేదెలు మేత కోసం సంచరిస్తుంటాయి. పచ్చటి చెట్ల మధ్యలో కంచె లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మేత కోసం వెళ్లి అవి మృత్యువాత పడే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో సైతం ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.